ట్రాఫిక్ టెన్షన్‌కు చెక్

- ఆవ వంద అడుగుల రోడ్డుకు అనుసంధానంగా రెండు రోడ్లు
- కార్పొరేషన్ గ్రీన్ సిగ్నల్

రాజమహేంద్రవరం రూరల్: మోరంపూడి జంక్షన్‌లో ఫ్లెఓవర్ నిర్మాణంతో ట్రాఫిక్ కారణంగా వాహన చోదకులు ఇక్కట్లు పడుతున్నారు. వాటి పరిష్కారానికి నగరపాలక సంస్థ ఆవ 100 అడుగుల రోడ్డుకు అనుసంధానంగా రెండు రోడ్ల నిర్మాణానికి చర్యలు చేపట్టింది. దీంతో మోరంపూడి జంక్షన్‌లో ట్రాఫిక్ కష్టాలు తొలగనున్నాయి.

వేగంగా నిర్మాణ పనులు

మోరంపూడి జంక్షన్లో ఫ్లెఓవర్ నిర్మాణం వేగవంతంగా జరుగుతోంది. దీని కారణంగా మోరంపూడి జంక్షన్ మీదుగా వాహనాల రాకపోకలతో తరచూ ట్రాఫిక్‌కు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి.

రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్ రామ్ నగరపాలకసంస్థ కమిషనర్ దృష్టికి ఈ సమస్యను తీసుకువెళ్లి, త్వరితగతిన హుకుంపేట జాతీయ రహదారి నుంచి ఆవ వాంబేకాలనీ 100 అడుగుల రోడ్డుకు అనుసంధానంగా రోడ్ల నిర్మాణం చేపట్టాలని ఆదేశించారు. దీంతో నగరపాలకసంస్థ అధికారులు ఎస్వీ జనరల్ మార్కెట్ నుంచి, వీఎల్ పురం సత్యనారాయణపురం నుంచి 100 అడుగుల రోడ్డుకు అనుసంధానంగా రోడ్ల నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. వీటికి రూ.1.78 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేయడంతో పాటు మంజూరు చేయడం జరిగింది. త్వరలోనే నిర్మాణ పనులను ప్రారంభించి ఒక్క నెలలోపే వాటిని పూర్తి చేయాలని నగరపాలకసంస్థ కమిషనర్ దినేష్ కుమార్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఇవి పూర్తయితే 100 అడుగుల రోడ్డు మీద నుంచి ఎస్వీ జనరల్ మార్కెట్, సత్యనారాయణపురం రోడ్ల మీదుగా రాజమహేంద్రవరం నగరంలోకి చేరుకుంటారు. తిరిగి వెళ్లేటప్పుడూ ఇదే మార్గంలో ప్రయాణిస్తారు. దీనివల్ల మోరంపూడి జంక్షన్‌కు ట్రాఫిక్ రద్దీ తగ్గనుంది.


మోరంపూడి జంక్షన్‌లో ట్రాఫిక్


ఆవ 100 అడుగుల రోడ్డు


నూతనంగా నిర్మించనున్న ఎస్వీ జనరల్ మార్కెట్ రోడ్డు

క్లుప్తంగా

వేగవంతంగా నాడు-నేడు పనులు


రికార్డులను పరిశీలిస్తున్న అసిస్టెంట్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్ రెడ్డి

కడియం: నాడు-నేడు పనులను వేగంగా పూర్తి చేయాలని అసిస్టెంట్ కలెక్టర్ సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి ఆదేశించారు. మండలంలోని మాధవరాయుడుపాలెం హైస్కూల్లో జరుగుతున్న నాడు-నేడు పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. రికార్డులను, తరగతి గదులను పరిశీలించారు. ఉపాధ్యాయుల పనితీరును, లెసన్ ప్లాన్‌పై ఆరా తీశారు. ఆయన వెంట విద్యాశాఖాధికారి వెంకటరాజు, శ్రీనివాస్, ఎంఈవో లజపతిరాయ్, ఏఈ కె.వీరభద్రరావు, హెచ్ఎం ప్రసాదరావు ఉన్నారు.

బాలకథా చంద్రిక పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డైట్ ప్రిన్సిపల్ రమణ తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని జిల్లా ప్రభుత్వ విద్యాశిక్షణాసంస్థ (డైట్)లో మంగళవారం లెక్చరర్ కొమ్ముల వెంకట సూర్యనారాయణ రచించిన బాలల కథా పుస్తకం బాలకథా చంద్రిక పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. డైట్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్‌డీవీ రమణ చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరిగింది. వృత్తి రీత్యా గణిత అధ్యాపకుడైనా ప్రవృత్తి రీత్యా బాలల కథా రచయిత కావడం హర్షణీయమన్నారు. దూబచర్ల డైట్ లెక్చరర్ ఎస్ఆర్ సుబ్రహ్మణ్యం, అధ్యాపకులు పాల్గొన్నారు.

పేదలకు వితరణ

కడియం: ప్రముఖ సినీనటుడు చిరంజీవి పుట్టినరోజు వేడుకలను మంగళవారం బుర్రిలంకకు చెందిన చిరుసేవా సమితి వ్యవస్థాపకుడు గెద్దం శివ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక సుధీర కిడ్స్ స్కూల్‌లో కేక్ కట్‌చేసి విద్యార్థులకు పంపిణీ చేశారు. బొమ్మూరులోని వివేకానంద మహారోగి ఆరోగ్య కేంద్రానికి స్టీలు ప్లేట్లు, గ్లాసులు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో సేవా సమితి సభ్యులు, చిరంజీవి అభిమానులు పాల్గొన్నారు.

27న విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల పంపిణీ


సమావేశంలో పాల్గొన్న సానబోయిన రామారావు తదితరులు

సీటీఆర్ఐ: పదో తరగతిలో ప్రతిభ చూపిన విద్యార్థులకు ఈ నెల 27వ తేదీన స్కాలర్ షిప్‌లు పంపిణీ చేస్తామని శెట్టిబలిజ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సానబోయిన రామారావు అన్నారు. మంగళవారం సంఘ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బొమ్మూరు నుంచి కేశవరం వెళ్లే రోడ్డులోని కొండగుంటూరు వద్ద ఉన్న ఎస్ఎస్‌వెన్యూ ఏసీ ఫంక్షన్ హాల్లో ఉదయం 10 గంటల నుంచి ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. అలాగే శెట్టిబలిజ సంఘం వారికి ఉచిత వివాహ పరిచయ వేదికను కూడా ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమానికి ఉభయ రాష్ట్రాల శెట్టిబలిజ సంఘం కన్వీనర్, ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు హాజరవుతారన్నారు. సమావేశంలో మేడిశెట్టి తాతబ్బాయి, మట్టపర్తి సత్యనారాయణ, బొక్కా సత్య వెంకట ప్రతాప్, చెల్లుబోయిన వెంకటేశ్వర్లు, గుత్తుల గోపీనాథ్, లావేటి సత్యనారాయణ, గుత్తుల ఉదయ భాస్కర్ పాల్గొన్నారు.

శాస్త్రవేత్తలతో ముఖాముఖీ రేపు

కడియం: కడియపులంకలోని సర్ ఆర్థర్ కాటన్ నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ కార్యాలయంలో నర్సరీ రైతులు, శాస్త్రవేత్తలతో గురువారం ముఖాముఖీ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు మల్లు పోలరాజు తెలిపారు. ఐసీఏఆర్ డైరెక్టర్ కేవీ ప్రసాద్‌తో పాటు, మరో నలుగురు శాస్త్రవేత్తలు ఈ కార్యక్రమానికి హాజరవుతారన్నారు. ఆ రోజు మధ్యాహ్నం 2.30 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమాన్ని నర్సరీ రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మత్స్యకారులకు శిక్షణ

మధురపూడి: మత్స్యకారులు వ్యాపారంలో లాభాలను ఆర్జించేలా తీర్చిదిద్దడానికి ప్రభుత్వం శిక్షణా తరగతులను నిర్వహిస్తోందని రాజమహేంద్రవరంలోని రాదాను సహకార శిక్షణా కేంద్రం సమన్వయకర్త వెదురుపాక శ్రీనివాస్ అన్నారు. కోరుకొండ లంకాలమ్మ దేవాలయం సమీపంలోని ఆర్‌బీకేలో మంగళవారం మూడు రోజుల శిక్షణ శిబిరం ప్రారంభమైంది. కార్యక్రమాన్ని డివిజనల్ సహకార అధికారి ఉమా పార్వతి ప్రారంభించారు. మత్స్యశాఖ అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ కె.హరీష్, గణేశ్వరరావు, కళ్యాణి పాల్గొన్నారు.

అర్హులందరికీ ఓటు హక్కు


మాట్లాడుతున్న కార్పొరేషన్ కమిషనర్ దినేష్ కుమార్

సీటీఆర్ఐ: అర్హులైన వారందరికీ ఓటు హక్కు కల్పించాలని నగరపాలక సంస్థ కమిషనర్ దినేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. స్థానిక శ్రీవెంకటేశ్వర ఆనం కళాకేంద్రంలో మంగళవారం బూత్ లెవెల్ అధికారులు, సూపర్‌వైజర్లు, సహాయ ఎలక్టోరల్ అధికారులతో ఓటర్ల జాబితా పరిశీలనపై సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితా పరిశీలన అత్యంత శ్రద్ధతో, నిబద్ధతతో పూర్తి చేయాలన్నారు. 2022లో జాబితా నుంచి తొలగించిన ఓట్లను నిశితంగా పరిశీలించాలన్నారు. సరైన కారణం లేకుండా తొలగించిన ఓట్లను తిరిగి జాబితాలో చేర్చుటకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పరిశీలన చేసిన దరఖాస్తుల వివరాలను జాప్యం లేకుండా ఏరోజుకారోజు ఆన్‌లైన్ చేయాలని ఆదేశించారు. అదనపు కమిషనర్ సత్యవేణి తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలి

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): సెప్టెంబరు 9వ తేదీన జరిగే జాతీయ లోక్‌అదాలత్‌లో టెలికాం, బ్యాంకులకు సంబంధించిన పెండింగ్, ప్రీలిటిగేషన్ కేసులను పరిష్కరించుకోవచ్చని జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత తెలిపారు. మంగళవారం జిల్లా న్యాయస్థాన ఆవరణలో ఆమె ఆధ్వర్యంలో బీఎస్ఎన్ఎల్, బ్యాంకింగ్ సంస్థల అధికారులతో సమావేశం నిర్వహించారు. ముందుగా పెండింగ్, ప్రీలిటిగేషన్ తరహా సమస్యలను గుర్తించి, సదరు జాబితాను జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు అందజేసి, రానున్న జాతీయ లోక్ అదాలత్‌లో పరిష్కారం పొందగలరని జిల్లా ప్రధాన న్యాయమూర్తి తెలిపారు.

డైట్‌లో ప్రోగ్రాం అడ్వైజరీ కమిటీ సమావేశం

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని జిల్లా ప్రభుత్వ విద్యాశిక్షణాసంస్థ (డైట్)లో 2023-24 సంవత్సరానికి చేపట్టాల్సిన కార్యక్రమాలపై ప్రోగ్రాం అడ్వైజరీ కమిటీ సమావేశం మంగళవారం ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్‌డీవీ రమణ అధ్యక్షతన జరిగింది. కార్యక్రమానికి హాజరైన సభ్యులనుద్దేశించి ప్రోగ్రాం అడ్వైజరీ కమిటీ కన్వీనర్, ప్రిన్సిపల్ డాక్టర్ రమణ మాట్లాడుతూ 2023-24లో నిర్వహించాల్సిన కార్యక్రమాలను సూచించాలని కోరారు. ఐఏఎస్ఈ ప్రిన్సిపల్ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా సాంకేతికతను జోడించిన అంశాలపై ఉపాధ్యాయులకు శిక్షణ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. విశ్రాంత ప్రిన్సిపల్ ఐహెచ్‌జీఎస్ ప్రసాద్ మాట్లాడుతూ కిందిస్థాయి అవసరాలను గుర్తించి దానికి అనుగుణంగా శిక్షణను రూపొందించుకోవాలన్నారు. ఎంఈవో తులసీదాస్ మాట్లాడుతూ డైట్ ఉపన్యాసకులతో పాఠశాలల మానిటరింగ్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఏఎం ఓ.గౌరీశంకర్ స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులకు, విషయ నిపుణులకు శిక్షణ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అడ్వైజరీ కమిటీ సభ్యులు డి.అనిత, తరపట్ల సత్యనారాయణ, ఆర్‌జేడీ రాజు, గంగారావు, లక్ష్మణరావు, కేవీ సూర్యనారాయణ, జానకీదేవి, రమేష్, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అధ్యక్ష, కార్యదర్శుల నియామకం

రాజానగరం: నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేయడంలో భాగంగా వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాలైన యువజన విభాగాలకు అధ్యక్ష, కార్యదర్శులు, సంయుక్త కార్యదర్శులను స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా మంగళవారం ప్రకటించారు. యువజన విభాగం జిల్లా ఉపాధ్యక్షుడిగా చీం డ్రిం శ్రీహరివర్మ (కోరుకొండ), ప్రధాన కార్యదర్శిగా గుడ్ల వినయ్ కుమార్ (తోకాడ), కార్యదర్శులుగా బండి నారాయుడు (దివాన్ చెరువు), గద్దె వీరన్నబాబు (పురుషోత్తపట్నం), సంయుక్త కార్యదర్శులుగా కొల్లి చిరంజీవి (మునికూడలి), చింతల గంగాధర్ (నల్గొండ)ను నియమించారు. అలాగే నియోజకవర్గ పార్టీ యువజన విభాగానికి అధ్యక్షుడిగా అయ్యల రమేష్ (కూనవరం), కోరుకొండ మండలానికి ఉల్లి ఘణబాబు (జంబూపట్నం), రాజానగరం మండలానికి పిల్లా లక్ష్మీనారాయణ (పాలచర్ల), సీతానగరం మండలానికి కోల శ్రీను (సీతానగరం) నియమితులయ్యారు.

జీతం అడిగితే చితక్కొడుతున్నారు


రచ్చబండలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎంపీ భరత్ రామ్

- రచ్చబండలో వృద్ధుడి ఆవేదన
- న్యాయం చేస్తానని ఎంపీ భరత్ రామ్ హామీ

రాజమహేంద్రవరం రూరల్: 'నేను పనిచేసి మానేసిన చోట ఒక నెల జీతం ఇవ్వాలి..అడిగితే చితక్కొడుతున్నారు..నాకు న్యాయం చేయండి' అంటూ ఓ వృద్ధుడు రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్ రామ్‌కు మొరపెట్టుకున్నాడు. మంగళవారం వీఎల్ పురం మార్గాని ఎస్టేట్స్ ప్రాంగణంలోని ఎంపీ కార్యాలయం వద్ద నిర్వహించిన రచ్చబండ కార్యక్రమంలో పలువురు తమ సమస్యలు, ఇబ్బందులు, ప్రభుత్వ సాయం కోసం, భూ తగాదాలపై అర్జీలు అందజేశారు. ధవళేశ్వరంలోని ఓ కల్యాణ మండపంలో వాచ్‌మన్‌గా పనిచేసిన తనకు నిర్వాహకులు ఒక నెల రోజుల వేతనం బకాయి పడ్డారని, అడిగితే తిప్పించుకుంటున్నారని ఆ వృద్ధుడు వాపోయాడు. వేతనం ఇస్తామని రమ్మని చెప్పి కొడుతున్నారని, దీనిపై పోలీసులకు కూడా ఫిర్యాదు చేసినట్టు తెలిపాడు. సంబంధిత కల్యాణ మండప నిర్వాహకులతో మాట్లాడి విషయం తెలుసుకుని న్యాయం చేస్తానని ఎంపీ హామీ ఇచ్చారు.

- సొంతింటి కోసం అప్పు చేసి కాంట్రాక్టర్ కు ఇస్తే అతడు కనిపించకుండా పోయాడని ఓ బాధితురాలు రచ్చబండలో ఆవేదన వ్యక్తం చేసింది. వెలుగుబందలో ఇంటి నిర్మాణానికి రూ.60 వేలు ఇచ్చారని, ఏడాదిన్నర అవుతున్నా కాంట్రాక్టర్ కుమార్ సమాధానం చెప్పడం లేదని తెలిపింది. పూర్తి వివరాలిస్తే కాంట్రాక్టర్‌ను పిలిచి వార్నింగ్ ఇస్తానని, ఆందోళన చెందవద్దని ఆ మహిళకు ఎంపీ భరోసా ఇచ్చారు. అలాగే సీఎంఆర్‌ఎఫ్ కోసం పలువురు ఎంపీకి అర్జీలు అందజేశారు. సీతానగరంలో తన రెండు సెంట్ల స్థలాన్ని ఒక వ్యక్తి కబ్జా చేయడానికి చూస్తున్నాడని మరో మహిళ తెలిపింది. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయం


మహిళలతో మాట్లాడుతున్న సిటీ కో ఆర్డినేటర్ గూడూరి శ్రీనివాస్

- వైఎస్సార్ సీపీ సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్
- ఉత్సాహంగా గడప గడపకూ..

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలన చేస్తున్నారని వైఎస్సార్ సీపీ సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అన్నారు. స్థానిక 49వ డివిజన్ సుబ్బారావు నగర్‌లో క్లస్టర్ ఇన్‌చార్జి, జీవకారుణ్య సంఘం ట్రస్టు కమిటీ చైర్మన్ బర్రే కొండబాబు ఆధ్వర్యంలో మంగళవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ గూడూరి శ్రీనివాస్ ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్న తీరును తెలుసుకున్నారు. స్థానికులు డ్రైనేజీ, విద్యుత్ సమస్యలను ఆయన దృష్టికి తీసుకురాగా అక్కడికక్కడే సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలతో పాటు, ఇవ్వని హామీలను సైతం నెరవేర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కు మాత్రమే దక్కుతుందన్నారు. ఇవాళ ధైర్యంగా ప్రజల్లోకి వెళ్లి, అభివృద్ధి, సంక్షేమాలను వివరిస్తున్నామంటే దానికి కారణం జగనన్న అందిస్తున్న సుపరిపాలనే అని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ కానుబోయిన సాగర్, మాజీ కార్పొరేటర్ అజ్జరపు వాసు, హితకారిణి సమాజం డైరెక్టర్ ఉల్లూరి రాజు, ఇన్నీసుపేట కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు ఉపాధ్యక్షులు గేడి అన్నపూర్ణ రాజు, కార్తిక్ సింగంపల్లి, నాయకులు గారా చంటిబాబు, వట్టికూటి కృష్ణవేణి, తిరగటి దుర్గ, విజ్జన మధు, ఓడూరి వెంకట రమణ పాల్గొన్నారు.

ప్రజల్లోకి ప్రభుత్వ సంక్షేమ పథకాలు




వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా, ఎంపీ భరత్ రామ్‌కు పుష్పగుచ్ఛాలు అందజేస్తున్న వైఎస్సార్ సీపీ సాంస్కృతిక విభాగ ఉభయ గోదావరి జిల్లాల రీజనల్ కోఆర్డినేటర్ ఆశ

రాజమహేంద్రవరం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని వైఎస్సార్ సీపీ సాంస్కృతిక విభాగ ఉభయ గోదావరి జిల్లాల రీజినల్ కోఆర్డినేటర్ నాగులపల్లి ఆశ అన్నారు. రీజినల్ కో ఆర్డినేటర్‌గా బాధ్యతలు చేపట్టిన ఆమె మంగళవారం పార్టీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, ఎంపీ మార్గాని భరత్ రామ్, పార్టీ కో ఆర్డినేటర్లు చందన నాగేశ్వర్, డాక్టర్ గూడూరి శ్రీనివాస్, నగర అధ్యక్షుడు అడపా శ్రీహరిని మర్యాదపూర్వకంగా కలిసారు. అందరి సూచనలతో సాంస్కృతిక విభాగాన్ని మరింత బలోపేతం చేస్తామన్నారు. ఆమె వెంట వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి లింగం రవి, వైఎస్సార్‌టీయూసీ, దివ్యాంగుల సెల్ జిల్లా అధ్యక్షులు ముద్దాల అను, ముత్యాల పోసికుమార్ ఉన్నారు.

స్వయం ఉపాధితో ఆర్థికాభివృద్ధి

ప్రకాశం నగర్: మహిళలు స్వయం ఉపాధితో ఆర్థిక స్వావలంబన సాధించాలని ఇన్నర్ వీల్ క్లబ్ పూర్వపు డిస్ట్రిక్ట్ చైర్ పర్సన్ లక్ష్మీ శ్రీనివాస్ అన్నారు. లాలా చెరువులోని స్వర్ణాంధ్ర సమావేశపు మందిరంలో మంగళవారం జరిగిన కుట్టుశిక్షణ ముగింపు ఉత్సవానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమానికి స్వర్ణాంధ్ర నిర్వాహకుడు గుబ్బల రాంబాబు అధ్యక్షత వహించారు. లక్ష్మీ శ్రీనివాస్ మాట్లాడుతూ మహిళలకు కుట్టు, మగ్గం, కంప్యూటర్లలో శిక్షణ అందించడం అభినందనీయమన్నారు. అనంతరం ఉత్తీర్ణులైన 63 మంది మహిళలకు ఉత్తీర్ణతా పత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. రాంబాబు మాట్లాడుతూ ఇంత వరకూ సుమారు 16 వేల మందికి పైబడి మహిళలు శిక్షణ తీసుకున్నారన్నారు. కార్యక్రమంలో టీచర్ దివ్య, ద్వారక, ప్రవల్లిక, అలేఖ్య, శ్రీదేవి సూర్యకుమారి, హేమలత, పావని పాల్గొన్నారు.

సున్నా వడ్డీ వర్తింప జేయాలి

ప్రకాశం నగర్: నగరపాలక సంస్థ పరిధిలోని ప్రతి మహిళా సంఘానికి బ్యాంకు ద్వారా రుణం మంజూరు చేయడంతో పాటు, మంచి పనితీరు కనపరచిన వారికి సున్నా వడ్డీ వర్తింప చేయాలని కమిషనర్ కె.దినేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో మంగళవారం సాయంత్రం మెప్మా విభాగం కమ్యూనిటీ ఆర్గనైజర్లు, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ స్వనిధి పథకంలో 10,500 మంది వీధి విక్రయదారులకు రూ.10 వేలు, రూ.20 వేలు, రూ.50 వేల చొప్పున రుణాలు ఇప్పించామన్నారు. అదనంగా వెయ్యి మంది వీధి విక్రయదారులను గుర్తించి, వారి దరఖాస్తులను ఆన్ లైన్ చేసి త్వరగా రుణాలు అందించేలా కృషి చేయాలన్నారు. రుణాలు అందించడం పాటు రుణాలు సక్రమంగా చెల్లించని బకాయిదారుల నుంచి రుణం వసూలు చేయడంలో బ్యాంకు వారికి సహకరించాలన్నారు. టిడ్కో ఇళ్ల త్వరితగతిన అప్పగించడం కోసం మిగిలిన లబ్ధిదారులకు బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేయించాలన్నారు. ఈ కార్యక్రమాన్ని ఈ నెలాఖరులోపు పూర్తి చేయాలని ఆదేశించారు. ఆహార క్యాంటీన్ కోసం అనుకూలమైన ప్రదేశాన్ని గుర్తించి, ఈ నెలాఖరులోగా ప్రారంభించడానికి చర్యలు తీసుకోవాలన్నారు.

మిర్తిపాడులో ఫ్యామిలీ డాక్టర్ సేవలు


ఎంపీపీ స్కూల్ విద్యార్థులకు వ్యక్తిగత శుభ్రతపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ మేఘన

సీతానగరం: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మిర్తిపాడులో బొబ్బిల్లంక పీహెచ్‌సీ డాక్టర్ కేజే మేఘన 70 మందికి వైద్యసేవలు అందించారు. అవసరమైన వారికి పరీక్షలు జరిపి, మందులు పంపిణీ చేశారు. మంచంపై ఉన్న రోగుల ఇంటికి వెళ్లి వైద్యం చేశారు. ఎంపీపీ స్కూల్ విద్యార్థులకు వైద్య పరీక్ష నిర్వహించారు. వారిలో ఐదుగురు విద్యార్థులకు రక్తహీనత ఉన్నట్లు గుర్తించారు. వారు వాడాల్సిన మందులను ప్రధానోపాధ్యాయుడికి అందించారు. అనంతరం విద్యార్థులకు ఆరోగ్య విషయాలపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి, పిల్లల బరువు చూసి, వారికి అవసరమైన మందులను అందించారు. బంగారు కొండ కార్యక్రమంలో బాలమిత్రలు దత్తత తీసుకున్న పిల్లల వద్దకు వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌సీ శైలజ, సచివాలయ ఏఎన్ఎం కుమారి, ఆశావర్కర్లు నిర్మల, జయలక్ష్మి, సీతామహాలక్ష్మి పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేకే ఆరోపణలు

- ప్రతిపక్షాలపై ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ధ్వజం
- వైఎస్సార్ సీపీ శ్రేణులతో సమావేశం


కోరుకొండలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

మధురపూడి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో జరుగుతున్న అభివృద్ధిని చేసి ఓర్వలేక ప్రతిపక్షాలు ఆరోపణలు చేస్తున్నాయని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. కోరుకొండలోని శ్రీరస్తు కల్యాణ మండపంలో మంగళవారం పార్టీ శ్రేణులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతిపక్షాల అసత్య ఆరోపణలను ఎప్పటికప్పుడు ఎండగట్టాలన్నారు. హింసను ప్రేరేపిస్తున్న చంద్రబాబు నాయుడు నిసిగ్గుగా మాట్లాడుతున్నారన్నారు. నియోజకవర్గంలో రూ.2 వేల కోట్లతో అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేశామన్నారు. మండలంలోని కొన్ని గ్రామాలకు చెందిన నాయకులతో సోమవారం మాట్లాడిన ఆయన, మిగిలిన కోటికేశవరం, కోటి, రాఘవపురం, బొల్లెద్దుపాలెం, శ్రీరంగపట్నం, కాపవరం గ్రామాల నాయకులకు మంగళవారం దిశానిర్దేశం చేశారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం

ఎమ్మెల్యే రాజా మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా జక్కంపూడి జనబాట నిర్వహించామని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పిలుపులో భాగంగా గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా నియోజకవర్గంలో రూ.219 కోట్లతో వాటర్ గ్రిడ్ పథం మంజూరైన సంగతిని వెల్లడించారు. ఈ సందర్భంగా పార్టీ సచివాలయం, జేసీఎస్ సమావేశం నిర్వహించారు. వివిధ విభాగాలకు చెందిన కన్వీనర్లను అభినందించారు. అలాగే ప్రజల సమస్యల సాధన, పార్టీ కార్యక్రమాల నిర్వాహణ నిమిత్తం పలువురితో కమిటీని ఏర్పాటు చేశారు. పార్టీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ క్రమశిక్షణకు మారుపేరన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ అడపా కనకరాజు, కో కన్వీనర్ గణేశుల పోసియ్య, రాజానగరం కన్వీనర్ దూలం పెద్ద, మాజీ కన్వీనర్ మందారపు వీర్రాజు, ఏఎంసీ చైర్మన్ నక్కా రాంబాబు, నాయకులు తాడి హరిశ్చంద్ర ప్రసాద్ రెడ్డి, కడియాల పాపారావు, గట్టి ప్రసాద్, బొరుసు బద్రి పాల్గొన్నారు.

దివ్యాంగుడికి ట్రై సైకిల్ అందజేత

రాజానగరం: తన తండ్రి, దివంగత నేత జక్కంపూడి రామ్మోహనరావు ఆశయాల మేరకు స్థాపించిన ఫౌండేషన్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు, ఎంతో మందికి సహాయ, సహకారాలు అందిస్తున్నామని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. ప్రకాశం నగరంలోని ఆయన క్యాంప్ కార్యాలయంలో మంగళవారం ఎస్.చైతన్య కుమార్ అనే దివ్యాంగుడికి ట్రై సైకిల్, ఆదిత్య డిగ్రీ కాలేజీలో చదువుతున్న కె.శ్రీధర్‌కు సైకిల్ అందజేశారు. మండలంలోని పాత తుంగపాడులో నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమంలో దివ్యాంగుడైన చైతన్య కుమార్ పాఠశాలకు వెళ్లి, రావడానికి పడుతున్న ఇబ్బందులను గ్రామ పెద్దల ద్వారా ఎమ్మెల్యే తెలుసుకున్నారు. ఆ సమయంలో ఆయన ఇచ్చిన హామీ మేరకు మంగళవారం ట్రై సైకిల్ అందజేశారు. కార్యక్రమంలో స్వర్ణాంధ్ర సేవా సమితి అధ్యక్షుడు గుబ్బల రాంబాబు, వైఎస్సార్ సీపీ నాయకుడు మందారపు వీర్రాజు, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.